# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

జూన్ 6, 2012

## ప్రపంచ ప్రఖ్యాత రచయితల్లో ఒకరైన
## కామ్రేడ్ యాన్ మిర్దాల్ భారత పర్యటనలను
## కేంద్ర ప్రభుత్వం రద్దు చేయ తలపెట్టడాన్ని ఖండిస్తున్నాం!

కామ్రేడ్ యాన్ మిర్దాల్ స్వీడన్ దేశస్థుడు. ఆయన ప్రపంచ ప్రఖ్యాత రచయితల్లో ఒకరు. ఆయన జనచైనా సహా ప్రపంచంలోని అనేక దేశాలను పర్యటించి ప్రపంచ పీడిత ప్రజల పక్షాన నిలిచి కళలు, సంస్కృతి, చరిత్ర, పర్యావరణం మొదలైన అనేక అంశాలపై గత ఆరు దశాబ్దాలకు పైగా ఆయన తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు. ఆయన తన 82 ఏండ్ల వృద్ధాప్యంలో ఒక ప్రజాస్వామిక కార్యక్రమానికి హాజరు కావడానికై భారతదేశాన్ని సందర్శించి ఇక్కడ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమ ప్రాంతంలో పర్యటించి "భారతదేశంపై అరుణతార" పుస్తకాన్ని రచించారు. భారత కమూనిస్టు పార్టీ (మావోయిస్టు) అగ్రశ్రేణి నాయకత్వాన్ని కలిశారు. ఆ పుస్తక ఆవిష్కరణ సందర్భంగా మరోసారి ఆయన మన భారతదేశంలోని రాజధాని ఢిల్లీ సహా వివిధ పట్టణాల్లో పర్యటించి తన భావాలను అనేకమంది రచయితలతో, ప్రజాస్వామిక వాదులతో, విద్యార్థులతో, పాత్రికేయులతో పంచుకున్నారు. ఆయన పర్యటనలు గానీ, ప్రచురణలు గానీ అన్నీ బహిరంగంగా అందరికీ తెలిసి కొనసాగుతున్నవే. అలాగే ఆయన భావాలూ అందరికీ తేటతెల్లమే. ఆయన తను ఒక కమ్యూనిస్టునని స్పష్టంగానే చెప్పుకున్నారు. భారతదేశంలో దోపిడీ పాలకవర్గాలు సుదీర్ఘకాలంగా విప్లవోద్యమ అణచివేత చర్యలను కొనసాగించడాన్ని ఆయన స్పష్టంగా గత మూడు దశాబ్దాలకు పైగా పరిశీలిస్తున్నారు. 1980ల మొదట్లో ఆయన ఆంధ్రప్రదేశ్ పర్యటించి 'ఇండియా అవేట్స్' పుస్తకాన్ని రచించారు. భారత ప్రజాతంత్ర విప్లవోద్యమానికి సంఘీభావంగా గత కొంత కాలంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామిక శక్తులను కూడగట్టడానికి కృషి చేస్తున్న వారికి ఆయన యిస్తున్న మద్దతు శ్లాఘనీయమైనది. పీడిత ప్రజల పక్షాన నిలిచి ఆయన తన రచనా పటిమతో తన సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక, కమ్యూనిస్టు భావాలను నిర్భయంగా వెల్లడిస్తున్నారు. అమెరికా సామ్రాజ్యవాదం కఠినమైన నిబంధనలు పెట్టడం ద్వారా ఆయన్ని అమెరికాకు రాకుండా పరోక్షంగా నిషేధించిన విషయం జగద్విదితమే. ప్రస్తుతం నయా ఫాసిస్టు అమెరికా రాజ్యం అడుగుజాడల్లో భారతప్రభుత్వం ఆయన భారత పర్యటనపై నిషేధాన్ని విధించ పూనుకోవడం దాని ప్రజాస్వామ్య ముసుగును పూర్తిగా బహిర్గతం చేస్తూ, ఫాసిస్టు స్వభావాన్ని, నిజాల వెల్లడింతల పట్ల పిరికితనాన్ని స్పష్టం చేస్తుంది. ప్రపంచ సుప్రసిద్ధ రచయిత పట్ల భారత ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు వైఖరిని మా పార్టీ నిర్ద్వంద్వంగా ఖండిస్తోంది. దేశంలోని మేధావులను, ప్రజాస్వామికవాదులను, రచయితలను, కళాకారులను, విద్యార్థులను, పాత్రికేయులను, అన్ని సముదాయాల ప్రజలను భారత ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఖండించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తోంది.

భారతదేశంతో కామ్రేడ్ యాన్ మిర్దాల్‌కే కాకుండా ఆయన తండ్రి గున్నర్ మిర్దాల్, తల్లి ఆల్వా మిర్దాల్‌కు ఘనిష్ట సంబంధాలున్నాయి. నోబుల్ బహుమతి గ్రహీతలైన ఆయన తల్లిదండ్రులలో తల్లి స్వీడన్ రాయబారిగా భారతదేశంలో దాదాపు ఐదేళ్ళకాలం (1955-61) పనిచేసింది. ఈ జంటకు జవహర్‌లాల్ నెహ్రూ ఇంటర్నేషనల్ అండర్‌స్టాండింగ్ అవార్డ్‌ను భారత ప్రభుత్వం ఇచ్చి సత్కరించింది. వారి పుత్రుడైన కామ్రేడ్ మిర్దాల్ ఢిల్లీ విశ్వవిద్యాలయంలో అనేక విషయాలపై తరచుగా ప్రసంగాలు చేస్తున్నారు. ఈ రకంగా మన దేశంతో సుదీర్ఘకాలంగా సంబంధాలలో వుంటూ ఇక్కడి పీడిత ప్రజల సమస్యలను, వెతలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ తన శక్తి మేరకు వాటికి అక్షర రూపమిచ్చి ప్రపంచ ప్రజలకు అందజేస్తున్న భారత ప్రజల గొప్ప మిత్రుణ్ణి భారతదేశం రాకుండ అడ్డుకోవడానికి భారత ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి అత్యంత సిగ్గుచేటైనది. భారతదేశంలోని అతి విలువైన సంపదలను తమ ఇష్టానుసారంగా దోచుకుపోవడానికి బహుళజాతి కార్పోరేషన్‌లను, బడా పెట్టుబడిదారులను ఎర్ర తివాచీలు పరిచి ఆహ్వానిస్తున్న భారత ప్రభుత్వం మరోవైపు నిజమైన ప్రజాస్వామిక, ప్రగతిశీల భావాలతో వారిని అడ్డుకొంటున్న వారిని మాత్రం సహించలేక పోతున్నది. ఎన్‌రాన్, డోవ్ కెమికల్స్, పోస్కో, మోన్‌శాంటో, వేదాంత, అరెవా యింకా మరెన్నో అంతర్జాతీయ కార్పొరేట్ తిమింగలాలకు భారత ప్రభుత్వం ఆహ్వానాలు పలుకుతున్నది. వారిని అంటకాగే జిందల్, మిట్టల్, ఎస్సార్, టాటా, అంబానీలను ఆకాశానికెత్తుతూ వారికి సేవలు చేస్తున్నది. మన దేశంలోని విశాల ప్రాంతాల్లో నిక్షిప్తమై వున్న అతి విలువైన భూములు, అడవులు, కొండలు, నీరు, ఖనిజాలు, రకరకాల ఇతర ప్రాకృతిక వనరులను వారి దోపిడీ నుంచి కాపాడుకోవడానికి ఆదివాసీ ప్రజలు జీవన్మరణ పోరాటం చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడవుల్లో లక్షలాది పోలీసు, అర్ధసైనిక బలగాలను మోహరించి గత మూడేళ్ళుగా అత్యంత క్రూరంగా గ్రీన్‌హంట్ సైనికదాడులను కొనసాగిస్తూ రక్తపుటేరులను ప్రవహింప చేస్తున్నది. పట్టణాలలోకి, నగరాలలోకి గ్రీన్‌హంట్ దాడులు విస్తరించి, అక్కడి ప్రజాస్వామికవాదులను,

ఆదివాసీ శ్రేయోభిలాషులను, ప్రజా రచయితలను, కళాకారులను, పాత్రికేయులను రకరకాలుగా వేధిస్తూ, అరెస్టులు చేస్తూ, ఇంటరాగేట్ చేస్తూ, అమానుషంగా హింసిస్తూ, తప్పుడు కేసుల్లో ఇరికిస్తోంది. ఇప్పుడు గ్రీన్‌హంట్ దాడులు దేశ సరిహద్దులు సైతం దాటాయనడానికి కామ్రేడ్ యాన్ మిర్డాల్‌పై సాగుతున్న దాడే ఒక ప్రత్యక్ష ఉదాహరణ. విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న విప్లవ పార్టీని సమూలంగా నిర్మూలించడానికి మోహరించిన భద్రతా బలగాలకు తోడు భారత సైన్యాలను ఏ క్షణానైనా రంగంలోకి దించడానికి భారత ప్రభుత్వం సిద్ధమైంది. ఇలాంటి ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ, సామ్రాజ్యవాదుల అత్యంత ప్రమాదకర ధోరణులను వెల్లడిచేస్తూ పీడిత ప్రజల పట్ల, విప్లవోద్యమం పక్షం దృఢంగా నిలిచిన కామ్రేడ్ యాన్ మిర్డాల్ సరసన నిలిచి భారత ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ప్రజా రచయితలు, కవులు, కళాకారులు, ప్రజాస్వామికవాదులు, ఆదివాసీ శ్రేయోభిలాషులు మరో మాటలో పీడిత జన పక్షపాతులంతా దృఢంగా పోరాడుతారని మా పార్టీ పూర్తిగా విశ్వసిస్తున్నది.

ఈ దేశంలోని పాలకవర్గాలు కళాకారుల పట్ల, రచయితల పట్ల, పాత్రికేయులు, సినీ నిర్మాతలు, దర్శకుల పట్ల ఫాసిస్టు స్వభావంతో వ్యవహరించటడం ఇవ్వాళ కొత్తేమీ కాదు. ఈ దేశంలో ఎంతో మంది రచయితలు, ప్రజాస్వామికవాదులు అసంఖ్యామైన కుట్ర కేసుల పాలై కటకటాలకు తోయబడ్డ వారున్నారు. ఇటీవలే 2010 జూలై 1 నాడు హేమచంద్ర పాండే అనే ఢిల్లీ పాత్రికేయుణ్ణి బూటకపు ఎన్‌కౌంటర్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు కాల్చిచంపారు. కాశ్మీరు ప్రజల న్యాయమైన పోరాటాన్ని సమర్థించిన ఫలితానికి ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్‌పై భారత శిక్షాస్మృతి పడగ విప్పింది. సుప్రీం కోర్టు న్యాయవాది ప్రశాంత భూషణ్‌పై మతోన్మాద గూండా శక్తులు చేయి చేసుకున్నాయి. గతంలో సఫ్దర్‌హష్మీని పొట్టనబెట్టుకొన్న రాజ్యం తాజాగా ప్రజా కళాకారుడు జీతేన్ మరాండికి మరణ శిక్ష విధించి ప్రజాపోరాట వత్తిడితో ఉపసంహరించుకొంది. ఈ మధ్యకాలంలోనే పశ్చిమ బెంగాల్ నయా ఫాసిస్టు సామ్రాజ్ఞి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తనపై కార్టూన్ వేశాడన్న ఆగ్రహంతో ప్రొఫెసర్ అభిషేక్ మహాపాత్రను అరెస్ట్ చేయించింది. ఆ చర్యను ప్రశ్నించిన జాదవ్‌పూర్ యూనివర్శిటీ విద్యార్థులను మావోయిస్టు లంటూ వేధింపులకు గురి చేసింది. ఇలా దేశంలో రోజురోజుకూ పాలకవర్గాల ఫాసిస్టు దాడులు సర్వత్రా వ్యాపిస్తూ అత్యంత క్రూరంగా గ్రీన్‌హంట్ ప్రతాపాన్ని చూపుతున్నాయి. బ్రిటిష్ హయాంలో ఎందరెందరో రచయితలు, కళకారులు, విప్లవకారులు దేశభక్తిని చాటినందుకు ఉరికంబాలెక్కారు. ఆ సామ్రాజ్యవాదుల ప్రత్యేకించి ఈనాటి అమెరికా సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తుతూ భారత రాజ్యం దేశంలో అణచివేత చర్యలను తీవ్రతరం చేస్తోంది. కామ్రేడ్ యాన్ మిర్డాల్ కలానికి మరింత శక్తినిచ్చే ఒక విశాలమైన, బలమైన సంఘీభావ ఉద్యమాన్ని నిర్మించాల్సిందిగా, ఆయన భారత పర్యటన రద్దు వైఖరిని వెనక్కి తీసుకునేలా భారత ప్రభుత్వంపై పోరాడాల్సిందిగా మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది.

Abhay

(అభయ్ )
అధికార ప్రతినిధి
కేంద్ర కమిటీ
సీపీఐ (మావోయిస్టు)